క్లుప్తంగా

ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం..



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నెల్లికుదురు: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామంలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక నాయకులు, రైతులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలోని రాజులకొత్తపల్లి నుంచి నెల్లికుదురుకు ఆర్టీసీ బస్ సర్వీసు ప్రారంభించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి, మండల, గ్రామ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐలు

మహబూబాబాద్ రూరల్: మరిపెడ, తొర్రూరు, డోర్నకల్ సీఐలుగా విధుల్లో చేరిన రాజ్ కుమార్ గౌడ్, జగదీష్, రాజేష్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎంపీని కలిసిన నాయకులు



నెహ్రూసెంటర్: ఎంపీ బలరాంనాయక్‌ను ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా కొండ్ర ఎల్లయ్య మాట్లాడుతూ.. పార్లమెంట్ అభ్యర్థిగా అఖండ విజయం సాధించారని, మానుకోట అభివృద్ధి కోసం గతం కంటే మరింత ఎక్కువగా కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీను, రాధా, సుధారాణి, దేవి, ఉపేందర్, సాంబయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో తీజ్ పండుగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు. అనంతరం గోధుమ బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నరేందర్, గంట బాలకృష్ణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవి, పాల్గొన్నారు.

కేసు నమోదు

గూడూరు: మండల కేంద్రంలోని లక్ష్మీ గణేశ్ ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాప్‌లో అక్రమ ఎరువుల బస్తాల నిల్వ ఉన్నందున్న సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఓ అల్లె రాకేశ్ తెలిపారు. వివరాల ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లా చెన్నరావుపేట మండలం పాపయ్యపేట సొసైటీ గోదాం నుంచి సోమవారం ఉదయం అక్రమంగా 74 ఎరువుల బస్తాలు తరలించినట్లు సమాచారం వచ్చిందని ఏఓ తెలిపారు. వెంటనే వెళ్లి షాప్‌లో తనిఖీ చేయగా, 74 బస్తాలు ఉన్నాయని, వారి సమాచారం మేరకు ఆ షాపుపై కేసు నమోదు చేసినట్లు ఏఓ తెలిపారు.

‘సక్రమంగా విధులు నిర్వర్తించడంలేదు’

మరిపెడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే కొందరు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని, దీంతో పేద ప్రజలకు అధిక విద్యుత్ భారం పడుతుందని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ రామసహాయం సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. ప్రజలంతా ఇళ్లల్లో ఉన్న సమయంలో విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

మరిపెడ రూరల్: మండలంలోని వీరారం గ్రామ పంచాయతీ పరిధిలోని జీన్యతండా ప్రాథమిక పాఠశాలలో 12 ఏళ్లు పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు కుమార్‌ను గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాందాస్, బానోతు నవీన్, రాందాస్, మాలు, రఘు నాయక్, భావుసింగ్, వెంకన్న, సుమన్, రవీందర్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా హరిప్రసాద్

కేసముద్రం: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓగా పనిచేస్తున్న హరిప్రసాద్ సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

షాక్ కొడుతుంది.. జర జాగ్రత్త..!

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం
- సొంత ప్రయోగం చేసి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు
- అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్న విద్యుత్ అధికారులు

మరిపెడ రూరల్: వర్షాకాలం కావడంతో రైతులు అన్ని పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే ఈ సీజన్‌లో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో వానలు, ఈదురు గాలులకు చెట్ల కొమ్మలతోపాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాలకు గురు కావడం ఖాయం. పంట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ తీగలు తెగిపడి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉన్నాయో లేదో ఒకటికి రెండు మూడుసార్లు పరిశీలించుకుని నీళ్లలోకి దిగాలి. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్య వ్యవసాయ క్షేత్రాల్లో ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. వర్షాకాలంలో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే స్థానికంగా ఉన్న విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలియజేయాలి.

వర్షాకాలంలో చేయకూడనివి..

వర్షాకాలం విద్యుత్ స్తంభాలను తాకే ప్రయత్నం చేయకూడదు. విద్యుత్ స్తంభాలకు వేసిన స్టే వైర్‌ను, కేబుల్ టీవీ వైర్లను తాకవద్దు. సబ్ స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకు దూరంగా ఉండాలి. తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు. మరమ్మతులు చేయకూడదు. వర్షాకాలం వీధుల్లో గాలికి విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా.. కిందకు వేలాడుతున్న స్థానికంగా ఉన్న విద్యుత్ అధికారులకు తెలియజేయాలి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. స్తంభాలు పడిపోయినా, తీగలు కిందకు వాలిపోయినా, తెగి పడిపోయినా వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలి.

\- బి.అజయ్, ఏఈ, ఎల్లంపేట

‘హర్ ఘర్ తిరంగా’ ర్యాలీ

డోర్నకల్: డోర్నకల్‌లో సోమవారం బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ జాతీయ జెండా కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ స్ట్రీట్‌లోని బీజేపీ కార్యాలయం నుంచి పలు వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి షకీల్ మీర్జా, జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.రెహమాన్, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ గఫూర్, బీజేపీ మండల అధ్యక్షుడు గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవానాయక్ పాల్గొన్నారు.

తొర్రూరు: డివిజన్ కేంద్రంలో సోమవారం బీజేవైఎం తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు శీలం శ్రీనాథ్ ఆధ్వర్యంలో 500 మందితో బస్‌స్టాండ్ నుంచి వివేకానంద సెంటర్ వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కాగు నవీన్, నాయకులు నూకల నవీన్, రాజు, కుమార్, రవిబాబు, పులేందర్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ గురుకుల కళాశాల ప్రాంగణంలో సోమవారం జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షురాలు గుండె బోయిన నాగమణి, జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి చంద్రకళ, విజయ, రజితరెడ్డి, మంగమ్మ, శ్రీను పాల్గొన్నారు.



తొర్రూరు: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

మహబూబాబాద్: బీసీలకు 42శాతానికి రిజర్వేషన్ పెంచి, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగుకుమార్ డిమాండ్ చేశారు. సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి నాయకులు మోకాళ్లపై కూర్చొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పెరుగు కుమార్ మాట్లాడుతూ.. దేశ జనగణనలో బీసీ కులగణన చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభలో బీసీలకు యాభైశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలందరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రేషపల్లి నవీన్, అశోక్, ప్రవీణ్, రమేష్, మల్లికార్జున్, రమేష్, హర్షవర్ధన్, సత్యం, వేణు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న నాయకులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొంపెల్లి కృష్ణ (55) ఎలాంటి పనిదొరక ఖాళీగా ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మనస్తాపానికి గురై ఈనెల 7వ తేదీన పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. భార్య సమ్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: ఉరివేసుకుని వృద్ధుడి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలోని రామన్నపేట కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై ఎస్.భీమారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బానోత్ బిక్కు (80) భార్య కొంతకాలం క్రితం మృతిచెందగా ఒక్కడే గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈక్రమంలో అనారోగ్యానికి గురై మనోవేదనతో ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందాడు. కుమారుడు బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజ్యాంగ రక్షణకు నడుం బిగించాలి



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

నెహ్రూసెంటర్: దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడే రాజ్యాంగ రక్షణకు యువతరం నడుంబిగించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ‘భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు’ అంశంపై సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. దేశ ప్రజలందరికీ రాజ్యాంగం గుండెకాయ వంటిదని, అలాంటి రాజ్యాంగానికి మతోన్మాద శక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉందని ఆరోపించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సదస్సులో యాకయ్య, దర్గయ్య, హేమానాయక్, లక్ష్మణ్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జ్వరాలు..

కురవి: వైద్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, ఫలితంగానే జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయని, మానుకోట జిల్లా జ్వరాల బారిన పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సమావేశం జంగం ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాల కారణంగా పెద్దఎత్తున ప్రజలు మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారని ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. తక్షణం ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు, పార్టీ మండల కార్యదర్శి మలేడి కోటయ్య, నాయకులు కృష్ణయ్య, వెంకన్న, మల్లయ్య, తిరుపతి, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

సీపీఎస్ రద్దు హామీని నెరవేర్చాలి



సభ్యత్వం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

మహబూబాబాద్ రూరల్/మహబూబాబాద్ అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి కుటుంబాలకు శాపంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బలాస్టి రమేష్, జిల్లా కార్యదర్శి సోమ విష్ణువర్ధన్ అన్నారు. మహబూబాబాద్ మండలంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముడుపుగల్ జెడ్పీ, ఎంపీపీఎస్ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆరు నెలలకు ఒకసారి చెల్లించాల్సిన మధ్యంతర భృతిని గత ప్రభుత్వం రెండేళ్లుగా పెండింగులో పెట్టిందన్నారు. వాటిని తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రాచకొండ ఉపేందర్, నాయకులు గిరిజ, పద్మావతి, వసంత, విజయలక్ష్మి, శ్వేత, మమత, మద్దెర్ల రమేష్, కార్తిక్, రఫీ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: దేశంలో విద్యార్థుల పక్షాన నిలిచిన ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగు శ్రావణ్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్, పట్టణ కార్యదర్శి వికాస్, నాయకులు సాయి, హర్ష, వేణు, శ్రీను, మహేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని సోమవారం నాయకులు సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు బందు మహేందర్, సాయికిరణ్, సోహెల్, మధు, అశోక్, రాజ్‌కుమార్, రమేష్‌బాబు, విక్రం పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ వేడుకలను సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్‌కుమార్ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాసు సాయిచరణ్, కొమ్ము గణేశ్, యశ్వంత్, మహేందర్, చందు, భాను, ప్రకాష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: సంఘం జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



గూడూరు: నివాళులర్పిస్తున్న సీఆర్పీలు

గూడూరు: ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీఆర్పీలు కుందూరు శోభన్ రెడ్డి, రవికుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం రెండు సంవత్సరాల క్రితం మృతిచెందిన సీఆర్పీ గడ్డం శ్రీనివాస్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు జితేందర్, బాసింగ్, సరిత, నరేష్, సుధాకర్, సంపత్ రవి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బయ్యారం: రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల పలు కారణాలతో మరణించిన సీర్పీల చిత్రపటాలకు మండల సీఆర్పీలు సోమవారం ఎంఈఓ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాబులాల్, రవి, రమేష్, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.

కేసముద్రం/తొర్రూరు: రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రశిక్షలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగులకు సోమవారం ఆయా మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్, ప్రధాన కార్యదర్శి బానోత్ భిక్షపతి, ఉపేందర్, ఉదయ్, మురళీ, నాగవాణి, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నివారణకు చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పందులు, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన వార్డు బాట కార్యక్రమంలో భాగంగా 23, 25, 26 వార్డుల్లో సీపీఐ బృందాలు సోమవారం పర్యటించాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డుల్లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండి.ఫాతిమా, తోట రాజకుమారి, మంద శంకర్, నాంచారి దాసు, తండ శ్రీనాథ్ పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న నాయకులు

రైటింగ్ ప్యాడ్ల పంపిణీ

గార్ల: మండలంలోని సూర్యాతండాలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జుగల్‌కిషోర్ సొంతంగా రూ10వేల విలువ గల స్టాండ్ రైటింగ్ ప్యాడ్లను సోమవారం పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. అదేవిధంగా అదే పాఠశాలలో పనిచేస్తున్న సహోపాధ్యాయురాలు సరిత భర్త భీమాకు ఉద్యోగంలో పదోన్నతి లభించినందున విద్యార్థులకు రూ.5వేల విలువ గల నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

ఆర్డీఓ తనిఖీ

డోర్నకల్: డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయాన్ని మహబూబాబాద్ ఆర్డీఓ సోమవారం అలివేలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి దరఖాస్తుల వివరాల గురించి ఆరా తీశారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



మహబూబాబాద్ అర్బన్: చదువుకు పేదరికం అడ్డుకాదని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పూజారి వీరయ్య అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో జీపీఏ సాధించిన నిఖిత, నందిని విద్యార్థినులకు సోమవారం రూ.20వేల ఆర్థిక సాయం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజకుమారి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, శ్రీనివాస్, సరస్వతి పాల్గొన్నారు.

దంతాలపల్లి ఎస్సైగా రాజు

దంతాలపల్లి: దంతాలపల్లి ఎస్సైగా పిల్లల రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన కరుణాకర్ మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

సభ్యత్వ నమోదు

నెల్లికుదురు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి అన్నారు. అధ్యక్షుడు యుగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు.

మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాముగౌడ్

గార్ల: కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండా రాముగౌడ్‌ను నియమిస్తూ సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు.

‘మా ఊరికి బస్సు రావడం లేదు’

పెద్దవంగర: మా గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్న బస్సు రావడం లేదని కొరిపల్లి గ్రామస్తులు ఆరుట్ల వెంకట్, ఊట్ల వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం వారు మాట్లాడారు. అధికారులు స్పందించి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యాదిరెడ్డి, సోమిరెడ్డి, వెంకట్ రెడ్డి, బుచ్చయ్య పాల్గొన్నారు.

సీఐకు సన్మానం

డోర్నకల్: ఇటీవల బదిలీపై డోర్నకల్‌కు వచ్చిన సీఐ బి.రాజేష్‌ను సోమవారం పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, దాసరి నానియాదవ్, వెంకటేశ్వర్లు, భావ్‌సింగ్ పాల్గొన్నారు.

పరామర్శ..

తొర్రూరు రూరల్: అనేక కారణాలతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను సోమవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చిన పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అనుమాండ్ల తిరుపతిరెడ్డి, సుంచు సంతోష్, కందాడి అచ్చిరెడ్డి, మేరుగు మల్లేశంగౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

తొర్రూరు రూరల్: మండలంలోని దుబ్బతండాలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలని కోరుతూ కలెక్టర్‌కు తండావాసులు సోమవారం వినతిపత్రం అందించారు.

పెయింటింగ్ పోటీల్లో పాల్గొనాలి

బయ్యారం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న మండలంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెయింటింగ్ పోటీల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి సూచించారు. సోమవారం పోటీల వివరాలను విద్యార్థులకు తెలియజేశారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

దంతాలపల్లి: చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల హెచ్ఎం వేణు మాధవరెడ్డి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు.

కుర్చీల అందజేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని పర్వతగిరి ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేసి పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం సోమవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సన్మానం పొందిన ఉపాధ్యాయులు సుమీలరాణి, భాగ్యమేర్సీ, మమత విద్యార్థులకు కుర్చీలు, షూ బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లింగమూర్తి, ఉపాధ్యాయులు గీత, రామాచారి, హరినాయక్, రాధిక పాల్గొన్నారు.

వైద్యశిబిరం

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ షఫీ నేతృత్వంలో ఇంటింటికి తిరిగి జ్వరపీడితులను గుర్తించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమాదేవి, ఆశకార్యకర్తలు యాకమ్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

పరిమితికి మించి వైద్యం చేయొద్దు

గార్ల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయరాదని ఎస్సై జీనత్‌కుమార్, ప్రభుత్వ నోడల్ వైద్యాధికారి రాజ్‌కుమార్ జాదవ్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆర్ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఆర్ఎంపీలు ఉపేందర్, ఎండి జిలాని, జయశంకర్, ఉపేందర్‌రెడ్డి, శ్రీను, మాధవరావు పాల్గొన్నారు.

మంత్రికి వినతి



గార్ల: పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఖమ్మంలో సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో గుండా వెంకట్‌రెడ్డి, సూరపురెడ్డి వెంకట్‌రెడ్డి, రావూరి వెంకట్రామయ్య, ఆళ్ల సాంబశివరావు, ఝాన్సీలక్ష్మి ఉన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవాలి

తొర్రూరు: ప్రభుత్వం బడులను పరిరక్షించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదుట యూటీఎఫ్ 50 ఏళ్లు, ఎస్‌టీఎఫ్ఐ స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నాగ మల్లయ్య, ఎండీ రఫీ, వెంకటేశర్లు, యాకయ్య, రాయలు, చైతన్య, పార్వతి, నాగుమీరా పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

మహబూబాబాద్ రూరల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని టౌన్ ఎస్సై చల్ల అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ రూ.30వేల విలువ గల టీషర్టులను సోమవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎస్సై హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్ బాబు, స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, కోశాధికారి ఆకుల శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో పొగలు..

- నెల్లికుదురు బస్టాండ్‌లో ఘటన



నెల్లికుదురు: ఓ ఆర్టీసీ బస్సులో పొగలు వ్యాపించాయి. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. మహబూబాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు తొర్రూరు నుంచి మహబూబాబాద్‌కు వెళ్తున్న క్రమంలో నెల్లికుదురు బస్టాండ్‌కు చేరుకుంది. బస్సు వెనుక వైపు నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు గమనించి ఆందోళన చెందారు. డ్రైవర్ అప్రమత్తమై ప్రయాణికులను బస్సు నుంచి దించి చూశాడు. వెనుక టైర్ల నుంచి పొగరావడాన్ని గమనించి బ్రేక్ డ్రమ్ములు పట్టుకున్నాయని నిర్ధారించుకున్నాడు. అనంతరం బస్సును పక్కకు నిలిపి ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించి పంపించారు. ఇదే విషయం ఆర్టీసీ మేనేజర్‌కు చేరవేసినట్లు డ్రైవర్ తెలిపారు.